క్లుప్తంగా

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆత్మకూరు : మండలంలోని గూడెప్పాడ్ గ్రామంలో నకిలీ రసీదులతో గ్రామపంచాయతీ నిధులను పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్ దుర్వినియోగం చేస్తున్నారని మంగళవారం మాజీ ఎంపీటీసీ బీరం రజనీకర్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హౌజ్‌బుజుర్గులో చోరీ

ఆత్మకూరు : మండలంలోని హౌజ్‌బుజుర్గు గ్రామంలో సోమవారం రాత్రి ఓ ఇంట్లో చోరీకి జరిగింది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. హౌజ్‌బుజుర్గు గ్రామానికి చెందిన పల్లె మొగిలి ఇంటికి తాళం వేసి పొరుగూరికి వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి గడియ కట్ చేసి ఉంది. ఇంట్లో బీరువా తెరిచి ఉండగా అందులోని 40 గ్రాముల బంగారు ఆభరణాలు, 18 తులాల వెండి ఆభరణాలు, రూ.5 వేల నగదు చోరీ అయ్యాయి. అలాగే సీసీ కెమెరాల ధ్వంసం చేసి హార్డ్ డిస్క్ ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. రూ.1.20 లక్షల విలువ చేసే వస్తువులను కూడా అపహరించినట్లు ఆయన వివరించారు. బాధితుడు పల్లె మొగిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేలేరు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇతర ప్రాంతాల నుంచి మండలంలోని శాలపల్లి శివారు లక్ష్మీతండాకు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుడంగా మధ్యాహ్నం సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌కు తారస పడినట్లు తెలిపారు. దీంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాల్వ పనులు త్వరగా పూర్తిచేయాలి

పరకాల : దామెర చెరువు కాల్వ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని 9వ వార్డు మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి కోరారు. ఈ మేరకు మంగళవారం పరకాల మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్‌కు వినతిపత్రం అందించారు. చెత్తాచెదారం తొలగించాలని లేని పక్షంలో కాలనీవాసులతో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు చేస్తామని హెచ్చరించారు.

మద్యానికి బానిసై ఒకరి మృతి



కుళ్లిపోయిన సాంబయ్య మృతదేహం

కమలాపూర్ : మండలంలోని గుండేడుకు చెందిన మంద సారయ్య (40) మద్యానికి బానిసై మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సారయ్య గత నెల 25వ తేదీన వ్యవసాయం చేయగా వచ్చిన డబ్బులు తీసుకుని బంధువుల ఇంటికి వెళ్లొస్తానని చెప్పి ఇంట్లోంచి వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో దీంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియలేదు. చివరకు మంగళవారం గుండేడు శివారులోని వాగు ఒడ్డున తన వ్యవసాయ బావి వద్ద మృతిచెంది కనిపించాడు. తన భర్త మద్యానికి బానిసై మద్యం సేవించి ఎండ తీవ్రతకు డీహైడ్రేషన్‌కు గురై మృతిచెందినట్లు కనిపిస్తోందని, ఎవరి మీద అనుమానం లేదని మృతుడి భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



పోస్టర్లను ప్రదర్శిస్తున్న రమాదేవి, తదితరులు

పర్వతగిరి : మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి తెలిపారు. మండలంలోని కల్లెడలో స్నేహ గ్రూప్ కిశోర బాలికలకు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మిషన్ శక్తి ప్రోగ్రాం సేవలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియాతో ప్రయోజనాలు–నష్టాలపై వివరించారు. బాలల హక్కులు, లింగ సమానత్వం, కౌమార బాలికల సాధికారత, నాయకత్వ లక్షణాలు, ఆపద సమయంలో వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. బాధితులు ఆపద సమయాల్లో 1098, 100, 181, 14567, 1930, 155326 నంబర్లకు ఫోన్ చేసి సాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ కాంతయ్య, వీఓఏ అధ్యక్షులు పి.రజిత, సుజాత, వీఓఏ మహేశ్వర్, పంచాయతీ సెక్రటరీ డి.మాధవ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

‘భూ భారతి’తో సమస్యల సత్వర పరిష్కారం

- ఆర్డీఓ నారాయణ
- వివిధ మండలాల్లో ప్రారంభమైన రెవెన్యూ గ్రామసభలు
- దరఖాస్తులు సమర్పించిన రైతులు
- ఐనవోలులో సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్, టెస్కాబ్ చైర్మన్



శాయంపేట : పత్తిపాకలో రైతుల దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ నారాయణ

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతితో చట్టంతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని పరకాల ఆర్డీఓ నారాయణ అన్నారు. మండలంలోని పత్తిపాక గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం తహసీల్దార్ కల్వల సత్యనారాయణ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. భూ సమస్యలపై 153మంది రైతుల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించినట్లు చెప్పారు. రైతులు సమర్పించిన దరఖాస్తులు పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. గతంలో ధరణి స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు మేధావులు, రైతు సంఘాలు చర్చించి గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం తీసుకువచ్చారని అన్నారు. లోపభూయిష్టంగా ఉన్న ధరణి వలన పట్టాల జారీలో ఏదేని పొరపాటు జరిగితే అప్పీలు చేయడానికి అవకాశం లేదని, రైతులు సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. భూ భారతి చట్టం ద్వారా భూములు కొనుగోలు చేసినా, విక్రయించినా లైసెన్స్ సర్వేయర్ ద్వారా హద్దులతో మ్యాపు తయారు చేసి పట్టాదారు పాసు పుస్తకాల్లో నమోదు చేస్తారని, దీంతో భూమి గుర్తింపునకు అవకాశం ఉందన్నారు. ఎలాంటి పొరపాటు జరగకుండా ఉంటుందన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు దామెర మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆత్మకూరు మండలంలోని అగ్రంపహాడ్, దామెర మండల కేంద్రంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అగ్రంపహాడ్‌లో 235 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి తెలుపగా దామెరలో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ జ్యోతివరలక్ష్మి దరఖాస్తులు స్వీకరించారు.

ధర్మసాగర్ : రైతుల సమస్యలు పరిష్కరించేందుకు భూ భారతి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ సదానందం తెలిపారు. మండలంలోని సోమదేవరపల్లి గ్రామంలో మంగళవారం రెవెన్యూ అధికారులు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలతో సమన్వయం చేస్తూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. సదస్సులో మొత్తం 95 దరఖాస్తులు వచ్చాయని, అందులో 2 సకాలంలో పరిష్కరించడం జరిగిందని, 4 సక్సేషన్, 4 ఆర్ఓఆర్ అప్పీల్, 85 సాదాబైనామా దరఖాస్తూలు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

వేలేరు : భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తహసీల్దార్ హెచ్.కోమి అన్నారు. మండలంలోని గుండ్ల సాగర్ గ్రామంలో మంగళవారం భూ భారతి సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, సీనియర్ అసిస్టెంట్ హేమనాయక్, ఆర్ఐ సురేందర్, సర్వేయర్ కవిత, సిబ్బంది పద్మ, రవీందర్, రోహన్, రమేశ్ పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండలంలోని బావుపేట, భీమదేవరపల్లి మండల కేంద్రంలో మంగళవారం భూ భారతి రెవన్యూ సదస్సు నిర్వహించారు. భీమదేవరపల్లిలో 60 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రాజేశ్ తెలిపారు. ఎల్కతుర్తి మండలం బావుపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 198 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ జగత్‌సింగ్ తెలిపారు.

పరకాల : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో భూ భారతి రెవెన్యూ గ్రామ సభలో 83 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కమలాపూర్ : భూ సమస్యల పరిష్కరించేందుకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి స్పష్టం చేశారు. మండలంలోని మాదన్నపేటలో మంగళవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. అధికారులు భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి 139 దరఖాస్తులు స్వీకరించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య, డైరెక్టర్ యాకూబ్‌పాషా, తహసీల్దార్ సురేశ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ శోభారాణి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు పరిశీలన



ఐనవోలు : రెవెన్యూ సదస్సులో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు : మండలంలోని పున్నేలు గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సును జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మంగళవారం పరిశీలించారు. హెల్ప్‌డెస్క్, జనరల్ డెస్కులతో పాటు రైతులు అందిస్తున్న దరఖాస్తులను పరిశీలించారు. రైతులతో మాట్లాడి తహసీల్దార్‌కు పలు సూచనలు చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే నాగరాజు పున్నేలు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెవెన్యూ సదస్సులో 116 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ విక్రమ్‌కుమార్ తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని రెండు రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బియ్యం నాణ్యతను పరిశీలించారు. లబ్ధిదారులకు అందిస్తున్న బియ్యం తూకాన్ని గమనించారు.



ఆత్మకూరు : అగ్రంపహాడ్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి



ధర్మసాగర్ : దరఖాస్తులు సమర్పిస్తున్న రైతులు

నాణ్యమైన విత్తనాలనే ఎంపిక చేసుకోవాలి



కమలాపూర్ : రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్ పర్సన్ ఝాన్సీరాణి



వేలేరు : రైతులకు విత్తనాలు అందజేస్తున్న అధికారులు



ఎల్కతుర్తి : రైతులకు విత్తన బ్యాగులు పంపిణీ చేస్తున్న రవీందర్‌గౌడ్, అధికారులు

కమలాపూర్ : వరిలో డబ్ల్యూజీఎల్-44, డబ్ల్యూజీఎల్-1537, కందిలో డబ్ల్యూఆర్‌జీ-121 రకాలు సాగు చేయడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని వరంగల్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వాతి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో పండించిన నాణ్యమైన డబ్ల్యూజీఎల్-44, డబ్ల్యూజీఎల్-1537 రకాల వరి, డబ్ల్యూఆర్‌జీ-121 రకం కంది విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం డబ్ల్యూజీఎల్-44, డబ్ల్యూజీఎల్-1537 రకాల వరి, డబ్ల్యూఆర్‌జీ-121 రకం కంది మూల విత్తనాలను ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి చేతుల మీదుగా ఎంపిక చేసిన రైతులకు రకానికి 16 మంది చొప్పున మొత్తం 48 మందికి పంపిణీ చేశారు.

ఎల్కతుర్తి : రైతులు పండించే పంటలకు చీడపీడలను తట్టుకుని అధిగ దిగుబడులు ఇచ్చే నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో మేలైన విత్తనాలపై అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన హాజరైన మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన వరి వంగడాలు, కంది విత్తనాలను రైతులను ఎంపిక చేసి పంపిణీ చేసినట్లు చెప్పారు.

ధర్మసాగర్ : రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని జయశంకర్ యూనివర్సిటీ సహాయ ఆచార్యుడు చల్లా యశస్విని, ఏఓ రాజేశ్ సూచించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే కార్యక్రమంలో భాగంగా జయశంకర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయ అధికారులు విత్తనాల బ్యాగులు పంపిణీ చేశారు.

నడికూడ : నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జయశకంర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అభ్యుదయ రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి పంటలో నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకుంటేనే పంట దిగుబడి 10 నుంచి 15 శాతం అదనంగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అర్చన, పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రశాంత్, ప్రదీప్, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

వేలేరు : నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంతీయ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ జే.భార్గవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని ఏడు రెవెన్యూ గ్రామాల్లో ఎంపిక చేసిన రైతులకు వరి విత్తనాలు డబ్ల్యూజీఎల్-44 సన్నరకం, 1537, 1355 దొడ్డురకం విత్తనాలను, డబ్ల్యూఆర్‌జీ-121 కంది రకాన్ని రైతులకు అందజేశారు. మండల వ్యవసాయాధికారి కవిత, ఏఈఓలు రాజశేఖర్, విజయ్‌కుమార్, శిల్పా పాల్గొన్నారు.

పరకాల : రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాజిరెడ్డి పిలుపునిచ్చారు. పంటసాగులో నాణ్యమైన విత్తనం పాత్రను వివరిస్తూ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ ఏడాది నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే వినూత్న కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రైతులకు విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న సంస్థ కో ఆర్డినేటర్ శారద

శాయంపేట : యోగా, ధ్యానం చేయడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ రామచంద్ర మిషన్ సంస్థ కో ఆర్డినేటర్ శారద అన్నారు. మండల కేంద్రంలోని నవోదయ హై స్కూల్‌లో శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యోగా, ధ్యానంతో ఆరోగ్యంతో పాటు, మనస్సు ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. మనిషి తన శరీరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకునేందుకు ధ్యానం అవసరమన్నారు. విద్యార్థులు ధ్యానం చేయడం వలన ఏకాగ్రత పెరిగి జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుందని అన్నారు. మొదటి రోజు 50 మంది యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. శ్రీ రామచంద్ర మిషన్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ అచ్చయ్య, రమేశ్, రాంబాబు, సత్యనారాయణ, సుధాకర్, సురేందర్ పాల్గొన్నారు.

చెట్టు కిందే చట్టం..!

- ప్రాణం మీదకు తెచ్చిన పెద్దమనుషుల తీర్పు
- పురుగులమందు తాగిన రైతు
- పలువురిపై కేసు
- మైలారంలో ఘటన

శాయంపేట : భూమి విషయంలో పెట్టిన పంచాయితీలో పెద్దమనుషుల తీర్పు ఓ రైతు ప్రాణం మీదకు వచ్చింది. తనకు అన్యాయం జరుగుతుందని మనస్థాపం చెందిన సదరు రైతు పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని మైలారంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మైలారం గ్రామానికి చెందిన నూనె తిరుపతికి అదే గ్రామానికి చెందిన మరో రైతుకు నాలుగేళ్ల నుంచి దారి విషయంలో గొడవ జరుగుతోంది. పెద్దమనుషుల మధ్య చాలాసార్లు పంచాయితీ పెట్టినా సమస్య పరిష్కారం కాలేదు. కొద్ది రోజుల నుంచి పలువురు పెద్దమనుషులు పంచాయితీలో భూమి ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో పాటు పోలీస్ స్టేషన్‌కు పిలించడంతో మనస్థాపానికి గురైన తిరుపతి మంగళవారం ఇంటి వద్ద పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు పరకాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా బాధితుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు పలువురు పెద్దమనుషులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎస్సై సాయిబాబు



మాట్లాడుతున్న ఎస్సై సాయిబాబు

ఎల్కతుర్తి : మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ముల్కనూరు ఎస్సై సాయిబాబు సూచించారు. మంగళవారం భీమదేవరపల్లి మండలం ధర్మారం గ్రామంలో గుట్కా, గంజాయ్ మత్తు పదార్థాల వలన కలిగే అనార్థాలపై జాగృతి కళాబృందం కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. యువత మత్తు బారిన పడొద్దని, తల్లిదండ్రులు తమ పిల్లలపట్ల శ్రద్ధ వహించి వారి నడవడికపై దృషి పెట్టాలన్నారు. గంజాయి అమ్మినా, సేవించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. బాల్య వివాహాలు. సీసీ కెమెరాలు, మూఢనమ్మకాలు, 1930 సైబర్ హెల్ప్ లైన్ గురించి వివరించారు. హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరావు, కానిస్టేబుల్స్ యాకుబ్ పాషా, వీరస్వామి, నాగమణి, విలియమ్స్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇక 24 గంటల వైద్యం

సాక్షి స్పందన

ఐనవోలు : మండల కేంద్రంలోని పీహెచ్‌సీని 24 గంటల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ అప్పయ్య ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక పీహెచ్‌సీలో 24గంటల వైద్యం అందడం లేదని, పాలకులు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని మే 31వ తేదీన సాక్షి దినపత్రిలో ‘నెరవేరని హామీలు’ అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన డీఎంహెచ్‌ఓ మంగళవారం పీహెచ్‌సీని సందర్శించారు. 24 గంటల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఇద్దరు స్టాఫ్ నర్స్‌ల అవసరం ఉందని మెడికల్ ఆఫీసర్ కోరగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

మద్యం సేవిస్తున్న వారిపై కేసు

వేలేరు : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న నలుగురిపై నమోదు చేసినట్లు ఎస్సై అజ్మీరా సురేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమంది వ్యక్తులు రాత్రి, పగలు అనే తేడా లేకుండా బహిరంగా ప్రదేశాల్లో సేవిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. జనసంచారం ఉన్న ప్రదేశాల్లో మద్యం సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలి

- ఎంపీడీఓ గుండె బాబు



మాట్లాడుతున్న ఎంపీడీఓ గుండె బాబు

కమలాపూర్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, మహిళా సంఘాల సభ్యులు, విలేజ్ ఆర్గనైజర్స్, విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్స్, అంగన్‌వాడీ టీచర్లు, హాస్టల్ వార్డెన్లు, పంచాయతీ కార్యదర్శులకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటపై మంగళవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థికి ఉచిత విద్య అందించాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రతి పాఠశాలలో 20 నుంచి 25 శాతం విద్యార్థుల నమోదు పెరిగేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ ఏడాది బడిబాట కార్యక్రమంలో ఆ మేరకు విద్యార్థులు నమోదు సంఖ్య పెంచాలన్నారు. అనంతరం ఎంఈఓ కె.శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచేందుకు గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈనెల 6 నుంచి 9 వరకు జరిగే బడిబాటలో విద్యా శాఖ విడుదల చేసిన విధంగా రోజువారి కార్యక్రమాలు చేపట్టాలని, ముఖ్యంగా డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశామని, త్వరలో యూనిఫామ్ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శివప్రసాద్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ నాగేంద్ర, సీఆర్పీలు సుభాశ్, శ్రీను, కరుణ, ఐఈఆర్పీ స్వప్న, ఎంఎస్ అధ్యక్షురాలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సర్వీస్ వైర్లు, స్టార్టర్లు చోరీ

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ గ్రామ శివారులో పెద్దచెరువు ప్రాంతంలో రైల్వే ట్రాక్ పక్కన ఉన్న పలువురు రైతులకు చెందిన వ్యవసాయ విద్యుత్ మోటార్ల సర్వీస్ వైర్లు, స్టార్టర్లను గుర్తుతెలియని దుండగులు సోమవారం రాత్రి అపహరించినట్లు బాధిత రైతులు తెలిపారు. సుమారు 20 మంది రైతుల విద్యుత్ మోటార్లకు అమర్చిన విద్యుత్ సర్వీస్ వైర్లతో పాటు స్టార్టర్లను ఎత్తుకెళ్లారని, దీంతో తమకు భారీ నష్టం వాటిల్లిందని వాపోయారు. దుండగులను గుర్తించి చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

మట్టి పరీక్షలతో భూమి ఆరోగ్యాన్ని కాపాడవచ్చు

- ఏఓ గంగాజమున



మట్టి నమూనాలను చూపుతున్న ఏఓ గంగాజమున

శాయంపేట : మట్టి పరీక్షలతో భూమి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని ఏఓ గంగాజమున సూచించారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో మంగళవారం మట్టి నమూనాలు సేకరించే విధానం, మట్టి పరీక్షల వలన కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతులు మట్టి పరీక్షలు చేసుకోవడం వలన పంట ఉత్పత్తిని మెరుగుపరచడం, వ్యయాన్ని తగ్గించడం, భూమి ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. మట్టిలో ఉన్న పోషకాలు పీహెచ్ స్థాయిని బట్టి ఏ పంటకు భూమి అనుకూలంగా ఉంటుందో తెలుసుకోవచ్చన్నారు. మట్టి పరీక్షల వలన మట్టిలో ఏ పోషకాలు లోపంగా ఉన్నాయో తెసుకొని సరైన ఎరువులు, సరైన మోతాదులో వాడుకోవచ్చన్నారు. మట్టికి అవసరమైన పోషకాల సమతుల్యాన్ని కల్పించడం వలన పంటల ఆరోగ్యం బాగుండి దిగుబడి పెరుగుతుందన్నారు. ప్రజ్వల్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల అందజేత

ఆత్మకూరు : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మంగళవారం సొసైటీ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి అనూష మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నాయకత్వంలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పూర్తి చేసేందుకు అన్నివిధాలుగా సిద్ధంగా ఉందన్నారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూర రాజేందర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బాలకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ రమ పాల్గొన్నారు.

మండల విద్యాధికారిని సస్పెండ్ చేయాలి

ధర్మసాగర్ : వర్కింగ్ టైంలో మండల కేంద్రంలోని విద్యాధికారి కార్యాలయానికి తాళం వేసి వెళ్లిన ఎంఈఓను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సీపతి వినయ్ డిమాండ్ చేశాడు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మండల సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించేందుకు వెళ్లగా ఎంఈఓ కార్యాలయానికి తాళం వేసి ఉందని అన్నారు. సిబ్బంది వినతిపత్రం తీసుకోకపోవడం విడ్డూరం ఉందన్నారు. ఎంఈఓకు సమస్యలపై వినతిపత్రం ఇస్తామని ఫోన్‌లో సంప్రదించగా దురుసుగా మాట్లాడారని ఆరోపించారు. ఈ సంఘటనపై డీఈఓ స్పందించాలని డిమాండ్ చేశారు. జూన్ 12 న విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్నందున మండలంలోని ప్రభుత్వ పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్ పాఠశాలల్లో కొన్నింటికి గోడలు లేవని అన్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.